విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడి సచివాలయ పరిధిలో శుక్రవారం ఎంపీ యూపీ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు బారులు తీరారు. సచివాలయ పరిధిలోని పెదపూడి, యద్దనపూడి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రోగులు తరలిరావడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. బీపీ, షుగర్, వైరల్జ్వరాలు లాంటి 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడంతో ప్రజలు అధిక సంఖ్యలో హాజరైనారు. విజయవాడకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ ఏ నిహారిక, డాక్టర్ జే.ఫణిశంకర్, పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ ఎం వేద రాజ్

(మొవ్వ), డాక్టర్ ఏ సాయికిరణ్ (నిడుమోలు) లతోపాటు ఆప్తాలజిస్ట్ అభిషేక్ (విజయవాడ)లు 630 మంది రోగులకు పైగావివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తాతా రజిని ప్రారంభించగా కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎండిఓ జి సుధాప్రవీణ్, వైస్ ఎంపీపీ కే.వి. కోటేశ్వరరావు, యద్దనపూడి సర్పంచ్ వాకా బాలకృష్ణ, కూచిపూడి పి ఎస్ ఎస్ మాజీ అధ్యక్షుడు తాతా రాంబాబు, మండల సచివాలయాల కన్వీనర్ సమ్మెటఆంజనేయులు, అధికార పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, గ్రేడ్ వన్ కార్యదర్శి ఏ డి వి ఎల్ ప్రసాద్, వైద్యాధికారులు, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కే రామాంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.కరుణాకర రెడ్డి, పెదపూడి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతాంగ కష్టాలు జగన్ ప్రభుత్వానికి పట్టవా ?

మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

విశాలాంధ్ర - అవనిగడ్డ : తాగు నీటి కోసం రైతాంగం కష్టాలు పాలవుతుంటే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం తగదని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దివిసీమలోని నాగాయలంక, కోడూరు పంట కాలువల చివరి ఆయ కట్టు భూములకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో వంతెన సెంటర్‌లోని రాజీవ్ గాంధీ చౌక్ వద్ద శుక్రవారం నిరసనదీక్షకు పిలుపునిచ్చారు. శేషుబాబు ఆధ్వర్యంలో కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలపగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ నిరసనదీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. త్రాగునీటి సమస్యపై రైతులు కష్టాలు పాలవు తున్నారని, ఒకవైపు ఎండలు తీవ్రమవ్వడం మరో వైపు కె.ఇ.ఒ కాలువలకు కేవలం 700 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేయడంతో అరకొరగా వస్తున్న నీరు చాలక రైతులు ఇబ్బందులు పడుతుంటే శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. పట్టిసీమ నీరు విడుదల చేసినా, ఎగువ ప్రాంతాల వారు ఆక్రమంగా నీరు వాడుకుంటుంటే ప్రభుత్వ చర్యలు చేపట్టి డెల్టాకు నీరు తీసుకురావడంలో విఫలమైందని మండలి విమర్శించారు. రెండు రోజులలో నీటి విడుదల తెంచకపోతే ప్రత్యేక్ష పోరాటానికి నడుము కడతామని హెచ్చరించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కార్యచరణ రూపొందించి రైతులకు అండగా నిలుస్తామన్నారు. దివిసీమ రైతాంగానికి సరిపడ నీరు తీసుకురావడంలో ఎం.ఎల్.ఎ సింహాద్రి పూర్తిగా విఫలమైయ్యారని బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక పరిస్థితులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, నీరు విడుదల చేయించలేకపోయారని మండలి అన్నారు. దివిసీమలో నీరు అందక ఎండిపోతున్న పంట పోలాలను చూసికూడా ఎం.ఎల్.ఎ స్పందించకపోవడం దురదృష్టకరమైన చర్య అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తాగు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అవనిగడ్డ, కోడూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, బండె శ్రీను, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారిలతో పాటు పెద్ద ఎత్తున ఆ పార్టీ మహిళలు, జనసేన పార్టీ దీక్షలకు సంఘీభావం తెలిపారు.

దివ్యాంగులకు సేవ చేయడం భగవంతుని సేవించడమే

కేంద్ర సహాయ మంత్రి ఏ.నారాయణస్వామి

విశాలాంధ్ర, మచిలీపట్నం : దివ్యాంగులకు సేవ చేయడం భగవంతుని సేవించడమేనని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఏ.నారాయణస్వామి అన్నారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని (ఏఎల్ఐఎంసిఓ) సంస్థ ద్వారా దివ్యాంగులకు, వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాలు పంపిణీ కొరకు ఏర్పాటుచేసిన సామాజిక సాధికారత శిబిరం మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని 420 మంది దివ్యాంగులకు రు.46.97 లక్షల విలువైన ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి పరికరాలు, బ్రెయిలీ కిట్స్, కృత్రిమ అవయవాలు తదితర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు పట్ల పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు లకు కేంద్ర మంత్రి అభినందనలు తెలియజేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో దివ్యాంగులు 1,35,000 మంది ఉన్నారని, ఇంత ఎక్కువ మంది దివ్యాంగులు ఉండడం కేంద్రమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కృష్ణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎస్సీ హాస్టల్ ఏర్పాటుకు 12 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరగా, ఈ మేరకు నిధులు మంజూరు చేయుటకు మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో 2011 సెన్సెస్ ప్రకారం 1,35,000 మంది దివ్యాంగులు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎల్ ఐ ఎస్ సి ఓ డీజీఎం సంజయ్ సింగ్, డిఆర్వో పి వెంకటరమణ జడ్పీ సీఈవో జ్యోతి బసు, ఆర్డీవో ఇన్చార్జ్ బి శివ నారాయణ రెడ్డి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - గన్నవరం : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపి వేయబడును.శనివారం ఉదయం 8 గంటల నుంచి 11:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దావాజీగూడెం, అల్లాపురం,రాజీవ్ కాలనీ, ఎస్టి బిఎల్ కాలనీ, దుర్గాపురం, ఎయిర్ పోర్ట్, బీబీగూడెం, గొల్లనపల్లి, చిక్కవరం ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యాపార వినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

తాళాలు తీసిన బ్యాంక్ అధికారులు

విశాలాంధ్ర - గన్నవరం : ఈ నాం భూములకు రుణాలు ఇవ్వటం సాధ్యం కాదని చెప్పిన బ్యాంక్ అధికారులు చెప్పగా, గురువారం రైతులు బీబీ గూడెం సహకార బ్యాంకు గేటుకు తాళాలు వేశారు. మండలంలోని బిబిగుడెం చెందిన 50 మందికి గతం లో ఈనాం భూములు ఉన్నాయి. దీంతో ఈ భూములు రెవెన్యూ రికార్డులో నమోదు కాలేదు. రైతులు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్స రం ఎమ్మెల్యే వంశీమోహన్ ఈనాం భూములను ప్రభుత్వంద్వారా ఈనాం భూములు నుండి తొలగింపజేసి సదరు భూములకు పట్టాలు మంజూరు చేశారు. దీంతో 50 మందికి భూమి హక్కు పొందారు. భూములు రెవిన్యూ రికార్డులో ఎక్కటంతో వారికి పాసు పుస్తకాలు కూడా వచ్చాయి. భూములు అమ్మకాలు కొనుగోలు జరగటం ద్వారా రిజిష్టర్లుకుగా జరుగుతున్నాయి. కానీ కో అపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఈనాం భూములకు రుణాలు ఇవ్వటం జరగదని చెప్పారు.దీంతో రైతు ఆగ్రహించి బ్యాంక్ గేటుకు తాళాలు వేశారు. బీబీ గూడెం కో అపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు బోయపాటి మురళి కృష్ణ బ్యాంక్ పై అధికారుల దృష్టి కి తీసుకొని వెళ్లగా ఈనాం భూములకు బ్యాంక్ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.దీంతో రైతు వేసిన తాళాలు శుక్రవారం తీసివేశారు.రైతులు ఈనాం భూములకు రుణాలు ఇస్తామని చెప్పటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు జైలులో ప్రాణహాని

- గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - గుడివాడ : రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ళు సీఎం చేసిన వ్యక్తిని రాజకీయ ప్రయోజనాల కోసం వైసిపి ప్రభుత్వం దొంగ సాక్షాలతో జైలుకు పంపిందన్నారు. ముఖ్యంగా 74 ఏళ్ల వయసున్న వ్యక్తి అని కూడా చూడకుండా, జైలులో కనీస వసతులు ఏర్పాటు చేయకుండా ఆయనపై కక్ష సాధింపుతో వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. చంద్రబాబు ఆరోగ్యం వివరాలను కూడా తెలియజేయడం లేదని, రాష్ట్ర మంత్రులు అవహేళనగా మాట్లాడడం సిగ్గుచేటని ఖండించారు. ఇలాంటి వ్యక్తుల పాలనలో ఉండడం తెలుగు ప్రజల దౌర్భాగ్యమని, సిగ్గుమాలిన జగన్ ప్రభుత్వానికి తెలుగు జాతి చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు విషయంలో అమానుషంగా ప్రవర్తిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పాలని రావి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు కుందేటి ప్రసాద్, రెడ్డి షణ్ముఖ, అడుసుమిల్లి శ్రీనివాస్, పంచుమర్తి శ్రీను, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ తగిన బుద్ధి చెబుతుంది

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్

విశాలాంధ్ర - గుడివాడ : సామర్లకోట సభలో సీఎం జగన్మోహన్ రెడ్డి వ్యవహరించిన తీరు హుందాగా లేదని జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు దేశం, జనసేన పార్టీల నాయకులు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమంలో ఒక బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని, పవన్ కళ్యాణ్ పెళ్ళిళ్ళపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని ప్రజల పైన లేనిపోని భారాలు మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోసారి పవన్ కళ్యాణ్ పెళ్ళిళ్ళ విషయాన్ని ప్రస్తావిస్తే జన సైనికులు, టిడిపి నాయకులు తగిన విధంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు. పవన్ వ్యక్తిగత జీవితం జోలికి వస్తే, జగన్ కుటుంబ నేపథ్యాన్ని బహిర్గతపరుస్తామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాస్, వేమూరి త్రినాథ్, సాయిన రాజేష్, బుడమ రాజు, మానుపాటి జేమ్స్, పడాల పూర్ణ, పడాల సౌమ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు అందుగుల ఏసుపాదం, తుమ్మలపల్లి సర్పంచ్ శింగాల రాధాకృష్ణ, అసలేటి నిర్మల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - గుడివాడ : ఈనెల 14వ తేదీ శనివారం పట్టణ పరిధిలో ఉదయం గం. 8 గం॥ నుండి 12.30 గం॥ వరకు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కోసం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కళాకృతులతో ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

విశాలాంధ్ర - అవనిగడ్డ : అరుదైన కళాకృతులతో ఉపాధి అవకాశాలు వస్తాయని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ డి.రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి ప్రోత్సాహంతో శుక్రవారం నాగార్జున యూనివర్సిటీ అండ్ హాస్పటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ షేక్ అబ్దుల్ రెహమాన్ సేకరించిన అరుదైన కళాకృతుల ప్రదర్శనను శుక్రవారం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించి మాట్లాడారు. ఖజకిస్తాన్, ఇరాన్ ఇరాక్ దేశాల కళాకారులు తయారు చేసిన భారతీయ సార్‌సానిక్ సాంస్కృతిక కళాకృతులు, రాజస్థాన్ కళాఖండాలు, ప్రాచీన మధ్య ఆధునిక కలలకు చెందిన భారతీయ చరిత్ర మరియు పర్యాటక రంగానికి చెందిన పుస్తకాలు పేరు గాంచిన చిత్రకారుల యొక్క పెయింటింగ్స్ ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను అవనిగడ్డలోని సెయింట్ ఆన్స్, ఎన్.ఆర్.ఐ వికాస్ మరియు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. అబ్బుర పరిచే విధంగా ఉన్నాయని భారతీయ కళలు, సంస్కృతి పట్ల గల అభిరుచితో తాను ఈ కళాకృతులు సేకరించినట్లు, ఆ యా కళాకృతుల యొక్క నేపథ్యాన్ని విద్యార్థులకు అబ్దుల్ రెహమాన్ వివరించారు. బి.ఎ విద్యార్థులకు షేక్ అబ్దుల్ రెహమాన్ అతిథి ఉపన్యాసం ఇవ్వగా అతిథి దేవో భవ అన్న భారతీయ ఖర్మ భూమి సూక్తికి భారతీయ పర్యాటక రంగం ఆదర్శంగా నిలుస్తుందని ఈ రంగంలో ఉపాధి అవకాశాలతో పాటు సంస్కృతి పట్ల అవగాహన, చరిత్ర పట్ల ఆశక్తి , ప్రాచీన శిల్ప సాంస్కృతిక చిత్ర కళా ప్రభావాన్ని భావితరాలకు అందించడంతో పాటు గత వైభవాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులలో చరిత్ర పట్ల భారతీయ పర్యాటక రంగం పట్ల అభిరుచి ప్రోత్సాహం పెంపొందించే మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన చరిత్ర అధ్యాపకురాలు రాజ్యలక్ష్మీని ఎం.ఎల్.ఎ సింహాద్రి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా మేరా మాటి మేరా దేశ్

విశాలాంధ్ర - గంపలగూడెం : ఆజాదికా అమృత మహోత్సవాల్లో భాగంగా "మేరీ మాటీ మేరా దేశ్" "నా భూమి నా దేశం"కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం మండలంలోని 24 గ్రామపంచాయతీల నుండి సేకరించిన మట్టిని శుక్రవారం జాతికి అంకితం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు "మట్టి కలశము"ను స్వచ్ఛంద కార్యకర్త కుమారి దీక్షిత కు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎర్రమల .పిచ్చిరెడ్డి అందజేశారు. ఈ మట్టి కలశమును విజయవాడ నుండి న్యూఢిల్లీ తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

రేపటి నుంచి మహా, విద్య, చండీ, హోమ సహిత శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక పెద ఎరుకపాడులో వైయస్సార్ సీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పద్మా వతి దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్ర దశమ వార్షిక మహొత్సవాలు ప్రారంభమవు తాయని భక్త బృందం సభ్యులు తెలియచేశారు. ఉత్సవ ఏర్పాట్లను మండలి హనుమంతరావుతో కలిసి భక్త బృందం సభ్యులు పరిశీలించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది దసరా నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ నిర్వాహకులు మండలి హనుమంతరావు తెలియచేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పాశుపత, మహావిద్య, చండీహోమ సహిత పూజా కార్యక్రమాలు గణాపాటీల పర్యవేక్షణలో జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఈ ఏడాది ప్రత్యేకంగా శివ కేశవుల కల్యాణ వేడుకలు కూడా నిర్వహిస్తామని, వేడుకల్లో పాల్గొని భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని భక్త బృందం సభ్యులు కొంకితల ఆంజనేయ ప్రసాద్, వంగలపూడి కనక బాబు, జ్యోతుల శ్రీనివాస్, పోతుల శ్రీకాంత్ పిలుపునిచ్చారు.

సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలి

- కొమ్మారెడ్డి కిషోర్

విశాలాంధ్ర - బంటుమిల్లి : చిన్నారులకు విద్యార్థి దశలోనే సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకునే విధంగా విద్యాబోధన ఉండాలని కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు. దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కొమ్మారెడ్డి పాఠశాల అవరణలో నవరాత్రులు జరిగే ఉత్సవాలను విద్యార్థులు నవదేవతల వేషధారణలతో పలువురిని అబ్బురపరిచారు .6 వ తరగతి విద్యార్థి మణిదీప్ దసరా పండుగ విశిష్టత గురించి, వివిఎల్ అజయ్ మహిసాసుర వధ కథను తొటి విద్యార్థులకు వివరించారు. తెలుగు అధ్యాపకులు వి.సాంబశివరాజు నేతృత్వంలో ఒక్కొక్క విద్యార్థిని నవదేవతల రూపాలను ధరించగా ఒక్కొక్క దేవత రూపం వెనుక ఉన్న విశిష్టతను పలువురికి వివరించారు. అనంతరం విద్యార్థులు పలు భక్తి గీతాలను ఆలపిస్తూ నృత్యాలను చేస్తూ అందరిని ఆకర్షించారు. విద్యార్థులు నిర్వహించిన మహిషాసుర వధ రూపా నికి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ నగదు, మెమెంటోలను అందజేసి విద్యార్థులను ఆశీర్వదిస్తూ, ప్రతి ఒక్కరికి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు కోసం జెండా చెట్టు వద్ద ప్రార్ధనలు

విశాలాంధ్ర - చల్లపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు సంపూర్ణ ఆరోగ్యం కలగాలనీ, అక్రమ కేసుల నుంచీ బయటపడి త్వరగా విడుదల కావాలని కోరుతూ చల్లపల్లి టీడీపీ నేతలు స్థానిక ఇస్లాం. నగర్ లోని జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. శుక్రవారం సాయంత్రం జెండా చెట్టువద్ద ముస్లిం గురువులు షకావత్, ఆరిఫ్లతో కలిసి ప్రార్ధనలు చేసి చంద్రబాబు కోలుకోవాలని ఆకాంక్షించారు. చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరి, టీడీపీ నేతలు నిడమానూరి దిలీప్కుమార్, రావి చిట్టి, చంద్ర వెంకటేశ్వరరావు, బోలెం నాగమణి, మోర్ల శివ, తుటారం ప్రసాద్, రావి రాజు, బావిశెట్టి కనకదుర్గ, కోట పద్మ, తాతా ప్రదీప్, షేక్ సిలార్, ముస్లిం పెద్దలు హమీద్, అమీర్ జానీ, యక్బాల్, షబ్బీర్, బాజి, యూనస్, నాగురా పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా గుడివాడ వామపక్షాల ప్రజా బ్యాలెట్

విశాలాంధ్ర -గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచనని ప్రభుత్వం వాగ్దానం చేసిన సీఎం జగన్, పాలనలోకి వచ్చిన తర్వాత నాలుగున్నర ఏళ్ల వ్యవధిలో రూ.25వేల కోట్లు భారాన్ని ప్రజల పైన మోపిన పరిస్థితి ఉందని సీపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. శు క్రవారం ఉదయం స్థానిక స్టేషన్ రోడ్‌లో వామపక్ష పార్టీలు విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌సిపి మాట్లాడుతూ ట్రూఆప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఆదానీతో సహా కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని అలాగే 2022 కేంద్ర విద్యుత్ బిల్లు ఉపసంహరించు కోవాలనీ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, సీపిఐ నేతలు సిహెచ్ సత్యనారాయణ, రామకృష్ణలు, ఐద్వా నేతలు పి.రజిని, డి.అరుణ, ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, కార్మిక సంఘాల నాయకులు పి.ప్రభుదాస్, రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

గాదే నేత్రదాన సేవలు ప్రశంసనీయం

- మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

విశాలాంధ్ర - గుడివాడ : నేత్రదానాన్ని ప్రోత్సహిస్తూ సమాజ సేవలో ముందుకు వెళుతున్న వాసవి క్లబ్ జిల్లా నాయకులు గాదే మోహన్ బాబు అభినందనీయుడని మున్సిపల్ కమీషనర్ వడ్లాది మురళీకృష్ణ పేర్కొన్నారు. ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నేత్రదాన యజ్ఞకర్త మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా కమీషనర్ చేతుల మీదుగా సత్కరించారు. కమీషనర్ మాట్లాడుతూ మానవునికి ప్రతి అవయవము ఎంతో అవసరమని వాటిలో నేత్రాలు ఎంతో కీలకమైనవని అన్నారు. ఇప్పటివరకు మోహన్ బాబు సారధ్యంలో 280 జతల కార్నియాలు సేకరించడం గొప్ప విషయమని ప్రశంసించారు. చనిపోయిన వారి కుటుంబీకులు విషాదంలో ఉండగా వారికి అవగాహన కల్పించి కార్నియాలను సేకరించడం కత్తి మీద సాము వంటిది అన్నారు. ఫ్రంట్ కన్వీనర్ డిఆర్‌బి ప్రసాద్, సయ్యద్ గఫార్, కుడకా పార్వతీశ్వరరావు, చుండి మహేష్ పాల్గొన్నారు.

రోగుల వద్దకే తరలివస్తున్న వైద్య నిపుణులు

విశాలాంధ్ర, కూచిపూడి : అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల వద్దకే కార్పొరేట్ స్థాయి వైద్యం తరలి వస్తోందని మొవ్వ మండల జిల్లా పరిషత్ సభ్యురాలు రాజులపాటి పార్వతి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం పెదపూడి ఎంపీ యూపీ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ సర్పంచ్ తాతా రజిని లతో కలిసి పరిశీలించారు. ఈ శిబిరాలలో ఈసీజీ, కంటి వైద్య పరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు లాంటివి నిర్వహిస్తుండడంతో ఈ శిబిరాలకు విశేష స్పందన పెరిగిందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతమందికో లబ్ధి చేకూరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి విజయవర్ధనరావు, ఎండిఓ జి సుధాప్రవీణ్, తాసిల్దార్ సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు తాతా రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఏ డి వి ఎల్ ప్రసాద్, 104 డీఈవో కే కోమలి పాల్గొన్నారు.

ఇంటిపేరు మార్పు ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియ చేయునది ఏమనగా తమ్ము లక్ష్మి, భర్త. రమేష్ అయిన నేను కృష్ణాజిల్లా, కృత్తివెన్ను మండలం, వాలంక గ్రామ కాపురస్తురాలను. వివాహం కాకముందు నా పేరు మోకా నాగలక్ష్మి అని నమోదై ఉన్నది. వివాహానంతరం నా భర్తగారి ఇంటి పేరుతో నా పేరు తమ్ము లక్ష్మీగా మార్చుకొనడం జరిగింది. నన్ను అందరూ తమ్ము లక్ష్మి అని పిలవాల్సిందిగా కోరడమైనది.

ఇట్లు
తమ్ము లక్ష్మి, వాలంక

మార్కుల జాబితా పోయినది

కృష్ణాజిల్లా, ఉయ్యూరు నగర పంచాయతీ, కాకాని పార్క్ సెంటర్, డోర్ నెం:10-268 వాస్తవ్యులు రెడ్రౌతు రమేష్ తండ్రి వీరాస్వామి 1976-77 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘంటసాల నందు పదవ తరగతి ఉత్తీర్ణత పొందాను. ది.04-10-2023న నా ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం రావి చెట్టు బజార్‌కు పదవ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, పాన్ కార్డు ఆధార్ కార్డు కవరుతో నా మోటార్ బైక్‌పై వెళ్ళుచుండగా మార్గ మధ్యలో కవరు జారిపోయింది. జిరాక్స్ సెంటర్‌కి వెళ్లి చూడగా కవరు కనిపించ లేదు.వెంటనే రహదారి వెంట అందర్నీ విచారణ చేయగా ఫలితం లేదు.నా మార్కుల జాబితా రోల్ నెం:052842, సర్టిఫికెట్ నెం: 016326. కావున ఎవ్వరికైనా సదరు కవరు గాని సర్టిఫికెట్లు గాని కనపడిన యెడల కింది అడ్రస్‌కి తెలుపగలరు.

రెడ్రౌతు రమేష్, తండ్రి : వీరాస్వామి
కాకాని పార్క్ సెంటర్
డోర్ నెం:10-268, ఉయ్యూరు..-521256
సెల్ : 99636 74843

పేదల ఇంటి ముంగిటే కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

విశాలాంధ్ర - అవనిగడ్డ : పేదల ఇంటి ముంగిటకే కార్పొరేట్ వైద్యం అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీటైన పాలకు నిదర్శనం అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం 4 వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎం.పి.డి.ఓ యామినిదేవి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిధిగా శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. నేడు విద్య, వైద్యం ఖరీదు అయిపోయిందని, పేదలకు అందు బాటులోనికి తెచ్చేందుకు ఊరూర జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తు ప్రజల ముంగిటే కార్పొరేట్ వైద్యాన్ని తీసుకువచ్చిన ఘనత దక్కిందని, పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఉచిత విద్యతో పాటు విద్యార్థులకు కావలసిన సకల సదుపాయాలు అందిస్తున్నా రన్నారు. ముందుగా వైద్యం కోసం వచ్చిన రోగులను పరా మర్శించి ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సందర్భంగా వివిధ శాఖలు నిర్వహించిన స్టాల్స్‌ను పరిశీలించి అంగన్‌వాడీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన తినుబండారాలను రుచి చూసి సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష అనే బృహోత్తర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ముందుగా వాలంటీర్లు, ఎ.ఎన్.ఎం లు ఇంటింటికి వెళ్ళి జల్లెడ పట్టి ఆరోగ్య భాదితులను గుర్తించి వైద్యం అందిస్తున్నట్లు ఇందు కోసం ప్రత్యేక వైద్యులు కూడా సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీ నారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎం.పి.టి.సి మేడికొండ విజయలక్ష్మీ, తహ శీల్దార్ ఎల్ శివరామకృష్ణ, ఇ.ఒ.పి.ఆర్.డి శైలజా కుమారి, పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చల్లపల్లిలో బాబుతో నేను

విశాలాంధ్ర - చల్లపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసిన వైనాన్ని ప్రజలకు తెలియచేసేలా చేపట్టిన "బాబుతో నేను" కార్యక్రమం చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం చల్లపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నేత, క్లస్టర్ ఇన్చార్జి మోర్ల శివ, బూత్ ఇన్చార్జి షేక్ సిలార్, ఎంపీటీసీ పైడిపాములు స్వప్న, టీడీపీ నేతలు షేక్ ఇబ్రహీం, బావిశెట్టి కనకదుర్గ, మహమ్మద్ జానీ, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఇస్లాం నగర్, 9వ వార్డులో ఇంటింటికీ వెళ్లి బాబుతో నేను కరపత్రాలను ప్రజలకు అందించి రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానాన్ని ప్రజలకు తెలియచేశారు.

పేదల ఆరోగ్య రక్షణ జగన్న సురక్ష..

విశాలాంధ్ర - గన్నవరం : పేదలకు ఆరోగ్యశ్రీ కంటే ఎక్కువ వ్యాధుల చికిత్స అందేలా సియం జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని యంపీపీ అనగాని రవి అన్నారు. గువారం మండలంలోని విరపనేనిగూడెం సచివాలయంలో జగ్గన్న ఆరోగ్య సురక్షను సర్పంచి అరెపల్లి జెజెమ్మ, యంపీపీ అనగాని రవి ప్రారంభించారు. అనగాని రవి మాట్లాడారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

పాలస్తీనాపై దాడులు ఆపాలి

- ఇజ్రాయెల్ దుశ్చర్యలను ప్రపంచ దేశాలు ఖండించాలి
- తక్షణమే యుద్ధం నిలిపివేసి శాంతిని పునరుద్ధరించాలి
- పాలస్తీనాకు సంఘీభాంగా విజయవాడలో సీపీఐ ర్యాలీ, పాల్గొన్న ముస్లిం యువకులు, పెద్దలు,
- ఇజ్రాయెల్ దూకుడుకు కళ్లెం వేయాలి...
- సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను వెంటనే నిలిపి వేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం విజయవాడ పంజా సెంటర్‌లో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లిం యువకులు, పెద్దలు, ముందుగా వించిపేటలోని షాహి మసీదు వద్ద నుండి పంజా సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెం వేసేలా చూడాలన్నారు. ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేవాల న్నారు. పాలస్తీనా ప్రజలు తిండిలేక అల్లాడిపోతున్నారని వారికి సంఘీ భావం ప్రకటించాలని కోరారు. అనేక దాశబ్దాలుగా పాలస్తీనా పై దాడులు జరుగుతున్నాయి. దాడులు జరుగుతున్న సందర్భంలో అనేక మంది ప్రాణాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులకు కారణం పాలస్తీనా మనవాదృక్పధం. 19వ దశాబ్దం జర్మనీలో యూదులు పై హిట్లర్ దాడులు జరిపారు. శరణార్థులైన యూదులను ఏ దేశం కూడా రానియలేదన్నారు. మనవాదృక్పధం కల్గిన పాలస్తీనులు రాణించారని, పాలస్తీను లో భూ భాగంలో కారుచౌక గా భూములు కొనుగోలు చేసి ఇప్పుడు పాలస్తీనులనే తరిమి కొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. తర్వాత మాత్రమే ఇజ్రాయెల్ ఏర్పడిందన్నారు. 2008 జరిగిన దాడిలో అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయ్యన్నారు. ఇప్పుడు కూడా వేల మంది ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనులకు ఆహారం లేక అలమట్టిస్తున్నారని, కరెంట్, నీరు లేక ప్రాణాలు ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారు. ఇజ్రాయెల్ దుశ్చర్యలను ప్రపంచ దేశాలు ఖండించాలని తెలిపారు. ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అప్సర మాట్లాడుతూ పాలస్తీనా పై ఇజ్రాయెల్ దురాక్రమణ ను అడ్డుకోవాలన్నారు ఇజ్రాయెల్ దాడులను ప్రతిఘటిస్తున్న పాలస్తీనా ఐక్యరాజ్య సమితి మద్దతు పలకలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ. ఫరూక్, ఎండీ.సమద్, తెలుగుదేశం మైనారిటీ నాయకులు ఎం.ఎస్ బేగ్, స్థానిక వైసీపీ కార్పొరేటర్ హర్షద్, సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య, స్థానిక పార్టీ నాయకులు పగిడి కత్తుల రాము, మురుగేషన్ రాము, సిద్ధిక్, స్థానిక ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- కంచికచర్ల: మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు "జగనన్న ఆరోగ్య సురక్ష" కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల చెంతకే కార్పొరేట్ వైద్యం అందించి అందరికీ ఆరోగ్య భరోసా కల్పించడమే జగనన్న సురక్ష లక్ష్యమని అన్నారు. ఆరోగ్య సురక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని రికార్డు చేస్తున్నారని, వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధిత స్పెషాలిటీ వైద్యుడి వద్దకు పంపుతున్నారని తెలిపారు. రోగికి అవసరమైన మందులను కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇచ్చినట్లు ఒక్కో రకం మందును, ఒక్కో కవర్లో పెట్టి ఇస్తున్నారని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఏ బిళ్ళ ఎప్పుడూ వేసు కోవాలో సులువుగా తెలిసేలా మందుల పంపిణీ చేస్తున్నారన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలి

విశాలాంధ్ర - మైలవరం: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన అధిక ధరలుకు వ్యతిరేకంగా సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జి.కొండూరు మండలంలోని చెవుటూరులో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని విద్యుత్ చార్జీలు తగించాలని డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలు నిత్యవసర వస్తువులు సరస మైన ధరలకు చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు అందించాలని ఈ ప్రచార నిరసన కార్యక్రమం ద్వారా ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, సీపీఐ పార్టీ జి కొండూరు మండల కార్యదర్శి గూడూరు శ్రీనివాసరెడ్డి, చెవుటూరు గ్రామ పార్టీ కార్యకర్తలు కొర్లపాటి రత్న, యడవల్లి మరియమ్మ, కొడాలి కుమారి, ప్రత్తిపాటి వెంకమ్మ, సంకటి జ్ఞానా నందం, చిన్ని రామారావు, గూడూరు శ్రీనివారెడ్డి, దూరు బాబు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు దగ్ధం

- తప్పిన ప్రాణనష్టం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): అతివేగంతో నిర్లక్ష్యంగా కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు దగ్ధమైంది. నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన శుక్రవారం విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వారధి నుంచి వస్తున్న మారుతి షిఫ్ట్ డిజైర్ కారు అతీవేగంగా వచ్చి స్క్రూబ్రిడ్జీ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. ఆకస్మాత్తుగా కారులో నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలన్నీ కారంతా వ్యాపించాయి. కారులో ఉన్న నలుగురు యువకులు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కారు పూర్తిగా దగ్ధమైంది.

చంద్రబాబు మచ్చలేని నాయకుడు

విశాలాంధ్ర- కంచికచర్ల: జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు ను వెంటనే విడుదల చేయాలని నందిగామ మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య శుక్రవారం డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసిస్తూ మండల పరిధిలోని వేములపల్లి గ్రామంలో బాబుకు మేము సైతం మీతోనే బాబు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిగామ మాజీ శాసనసభ్య రాలు తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు, జిల్లా మైనార్టీ నాయకులు ఎండి అల్లిపాష, తేలప్రోలు రమణయ్య, ముక్కపాటి నరసింహారావు, పలువురు దేశం నాయకులు పాల్గొన్నారు

అందరికీ నాణ్యమైన వైద్యం అందిస్తాం

తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: రాష్ట్రంలోని ప్రజందరికీ నాణ్యమైన వైద్యసేవలందించటమే ప్రభుత్వ లక్ష్యం అని తిరువూరు శాసనసభ్యుడు కె.రక్షణనిధి అన్నారు. విస్సన్నపేట పంచాయతీ మూడవ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన సురక్ష పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పథకం ద్వారా చేకూరిన అన్ని సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి ఎస్. నాగమల్లేశ్వరి, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఈవోఆర్డీ ఝాన్సీరాణి, వైకాపా కన్వీనర్ అనుమలు శివబాజి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' సేఫ్టీ అవార్డులు ప్రదానం

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : విధి నిర్వహణలో అప్రమత్తతో ఉంటూ రాబోతున్న ప్రమాదాన్ని తక్షణం గుర్తించి సకాలంలో చర్యలు తీసుకున్న విజయవాడ డివిజన్‌లోని ముగ్గురు ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ "మ్యాన్ ఆఫ్ ద మంత్" సేఫ్టీ అవార్డులను ప్రకటించగా వాటిని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అందజేశారు.మంగళవారం వర్చువల్ సేఫ్టీ మీటింగ్‌లో ఆయన ఈ అవార్డులను ప్రదానం చేశారు.జీఎం అరుణ్ కుమార్ జైన్ రైల్ నిలయం నుండి ప్రిన్సిపల్ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్-ఆరు డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. జీఎం సమయపాలన, సరుకు రవాణా లోడింగ్ పనితీరును క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ముఖ్యంగా భద్రతపై దృష్టిని మరింత మెరుగుపరచడానికి ఫీల్డ్ సిబ్బందితో మరింత పరస్పర చర్య చేయాలని అధికారులను ఆదేశించారు. రైలు సర్వీసుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని డివిజనల్ రైల్వే మేనేజర్లందరికీ సూచించారు. అనంతరం డివిజన్‌లో సేఫ్టీ అవార్డులను పొందిన వారిని అభినందించారు. రైలు ప్రయాణాల విధుల్లో అసాధారణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతిచోట భద్రతా అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. "మ్యాన్ ఆఫ్ ద మంత్" సేఫ్టీ అవార్డు పొందిన వారిలో ఎం.జాఈనేశ్వరరావు మండవల్లి స్టేషన్ మధ్య ఎల్‌సి గేట్‌మ్యాన్ విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 16న అఫ్‌లైన్‌లో వెళ్ళుతున్న గూడ్స్ రైలు నుండి హాట్‌ఎక్సెల్ గుర్తించి ఎద్దప్రమాదం నుండి రక్షించారు. ఆపరేటింగ్ విభాగంలో రాజేంద్ర భగత్ బయ్యవరం స్టేషన్ మాస్టార్‌గా పని చేస్తున్నారు. గత నెల 10న అనకాల్లి నుండి గూడ్సు వెళ్ళుతుండా ఒక వ్యాగన్ నుండి అసాధారణమైన శబ్దం వస్తుండటంతో గుర్తించి దానిని వీడదీసి మరామత్తులకు వెళ్ళేవిధంగా చేసి ప్రమాదం నుండి కాపాడారు. వై.కోటిరెడ్డి విజయవాడలో సి&డబ్ల్యూ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు.గత నెల 15న రైలు నెం.12615 చెన్నై- న్యూ ఢిల్లీ వెళ్ళు ఎక్స్‌ప్రెస్ రోలింగ్ -ఇన్ ఎగ్జామినేషన్ చేస్తుండగా సెకండరీ సస్పెన్షన్ ఔటర్ కాయిల్ స్ప్రింగ్ బాటమ్ కాయిల్స్ కంప్రెస్డ్‌లో వ్యత్యాసం ఉండటం గమనించి కోచ్‌లోని సరుకును అన్‌లోడ్ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయండి
- ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు కల్పించిన సౌకర్యాలను, అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడుగా పరిశీలించి అధికారులకు సిబ్బందికి తగు సూచనలు చేయాలని డిప్యూటీ సియం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఈనెల 15వ తేది నుండి 23 తేది వరకు ఇంద్రకీలాధిపై నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు, నగరపోలీస్ కమీషనర్ కాంతి రానా టాటా, ఆలయ ఇవో కె.ఎస్ రామరావు నగరంలోని కలెక్టరేట్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 15వ తేది ఆదివారం నుండి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శించుకోనున్నారన్నారు. ప్రతి రోజు దాదాపు 50 నుండి 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శిస్తారని, ఇందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేసి సిద్ధం చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, లోటుపాట్లను సరిదిద్ది ఈ ఏడాది మరింత పటిష్టంగా ఏర్పాట్లు ఉండేలా శాఖల సమన్వయంతో ఉత్సవాలను నిర్వహించేలా అధికారులు పనిచేయాలన్నారు. ఈనెల 20వ తేది శుక్రవారం మూల నక్షత్రం, సరస్వతీదేవి అవతారంలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారికి మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న దృష్ట్యా మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లను ఉండేలా అధికారులు చూడాలన్నారు. దసరా ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకునే విఐపిలు, వివిఐపిలకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారిని దర్శించుకునే వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఘాట్ రోడ్డులో భక్తులను తరలించే వాహనాలు తగిన జాగ్రతలు తీసుకునేలా వాహనా డ్రైవర్లకు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్లలో ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం కల్పించాలని, క్యూలైన్లలో త్రాగునీటి సరఫరాకు వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు లడ్డు ప్రసాదములు అందుబాటులో ఉండేలా 12 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ అవసరమైతే అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు కూడా సిద్ధంగా ఉండాలన్నారు. ఎటువంటి సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు మోడల్ గేస్ట్ హౌస్ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, దేవాదాయ, తదితర శాఖల అధికారులతో నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాట్లను చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ విశాల్‌గున్ని, , ధర్మకర్తల మండలి చైర్మన్ కె. రాంబాబు, వెస్ట్ ఏసిపి డాక్టర్ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర- నందిగామ: గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిని కూడా సమాచార హక్కు చట్ట పరిధిలోకి తీసుకువస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 437 జీ.వో. ఇచ్చిన నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులైన అడ్మిన్‌లు డిజిటల్ అసిస్టెంట్‌లు మరియు వాలెంటీర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందిగామ మునిసిపల్ కమీషనర్ యస్.జయరామ్ విచ్చేసారు. ఆర్.ఐ.ప్రసాద్ కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు. వక్తలు సమాచార హక్కు చట్టం 2005 గురించి అవగాహన కల్పించారు. పౌర సమాజ ఐక్య సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కురగంటి హనుమంత రావు మాట్లడుతూ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 18 సంవత్సరాలు పూర్తయిన సందర్భముగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ సదస్సుకు సంస్థ గౌరవ అధ్యక్షులు మరియు స్నేహక్లబ్ జిల్లా గవర్నర్ కె.జడ్.యస్.కుమార్, మహిళా ప్రతినిధి సరికొండ వాణి, కార్యవర్గ సభ్యులు టీ. సురేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ఉపసంహరించాలి

విశాలాంధ్ర-విజయవాడ : స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు డిమాండ్ చేశారు. సీపీఐ 58వ డివిజన్‌లో శుక్రవారం స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. విద్యుత్ ట్రూ అఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్. గురునాథం, సీహెచ్.గురవయ్య, టి. బ్రహ్మజీ, రహీమ్, శంకర్, ఎమ్.సాయి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల తాకిడి

విశాలాంధ్ర-వీరులపాడు : మండలంలోని అల్లూరు గ్రామంలో బౌద్ధ మతానికి చెందిన అశోకుడు ప్రతిష్టించిన ఆనవాళ్లు బౌద్ధ స్తూపం, బుద్ధుని ప్రతిమ కొన్ని సంవత్సరాల క్రితం తవ్వకాల్లో బయటపడ్డాయి. ప్రతి సంవత్సరం అక్టోబర్ 14 అశోక విజయదశమి సందర్భంగా ఈ క్షేత్రానికి సందర్శకులు తాకిడి ఉంటుంది. అదే క్రమంలో శుక్రవారం డాక్టర్ శ్రీకాంత్ గన్వీర్ తన 37 గురు విద్యార్థులతో కలిసి డెక్కన్ కాలేజ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పూణే కి చెందిన విద్యార్థులతో బౌద్ధ స్తూపం ఉన్న అల్లూరు ప్రదేశాన్ని సందర్శించారు. విద్యార్థులం దరికీ సిరిపురం సమన్విత్ ఇంచార్జిగా వ్యవహరించారు.

అందరికీ ఒకే నిబంధన అమలు చేయాలి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు అమలు చేస్తున్న నిబంధనలకు అందరికీ ఒకే విధంగా పటిష్టంగా అమలు చేయాలని పిఎల్‌టిఎ(ప్రైవేటు టీచర్స్, లెక్చరర్ల అసోసియేషన్) జిల్లా నాయకులు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలను జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో కూడా అమలు చేసేం దుకు పకడ్బందీ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రకటన జారీ చేసినవారిలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈడా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనపర్తి బాబూరావు, బొట్ల శివసత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు తుపాకుల చంద్రశేఖర్ ఉన్నారు.

ఇంద్రకీలాద్రి పై విద్యుత్ వెలుగులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బెజవాడలోని ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మ సన్నిధి పండుగ శోభ సంతరించుకుంది. ఈ నెల 15వతేదీ నుంచి 23వతేదీ వరకు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేస్తోంది. ఈనేపథ్యంలో మహారాజు గోపురం, ఓం టర్నింగ్, కనకదుర్గ నగర్, మహామండపానికి ట్రయల్ రన్‌గా శుక్రవారం విద్యుద్దీపాలకరణ చేశారు

IN THE COURT OF HON'BLE IIIrd Addl SENIOR CIVIL JUDGE, AT DEVANAHALLI
O. S. NO. 1048/2007
BETWEEN : PLAINTIFF Name & Address Smt. Manjula. R, W/o Sri. B. N. Srikantaiah, D/o Sri. Ramaiah, aged about 45 years, residing at Byramangala Village, Bidadi Hobli, Ramanagara Taluk, Ramanagara 562 109.
DEFENDANT Name & Address SANNAPUTTAPPA & OTHERS
NOTICE UNDER ORDER V RULE 20 OF CPC, 1908 BY WAY OF PAPER PUBLICATION
To, PROPOSED DEFENDANT NO. 12
12. GADDIPATI SUDHAKAR, S/o LATE ANJAIAH, AGED ABOUT 52 YEARS, R/o FLAT NO. 4C, ROYAL ORCHID APARTMENT, NEAR SHUBHAM KALYANAMANDAPAM, GUNTUR, ANDHRAPRADESH.
PROPOSED DEFENDANT NO. 14
14. KONERU LAKSHMAIAH EDUCATION FOUNDATION, REP. BY ITS PRESIDENT SRI. KONERU SATYANARAYANA, S/o KONERU LAKSHMAIAH, AGED ABOUT 68 YEARS, OFFICE AT 29-36-38, MUSEUM ROAD, GOVERNOR PET, VIJAYAWADA, ANDHRA PRADESH – 560 002.
Whereas the above name Plaintiff have filed application to implead you as proposed defendant no. 12 & 14 in the suit instituted by plaintiff against the defendants for partition and separate possession with respect to below mentioned schedule property.
You are hereby summoned to appear before this court on **02.11.2023 at 11AM** in person or through advocate/pleader to answer the questions to the same, failing which suit will be heard and determined ex-parte.
SCHEDULE
ITEM No. 21:- All that piece and parcel of the Land in Survey No. 56, New Converted Survey NO. 56/3, situated at Binnamangalal Village, Kasaba Hobli, Devanahalli Taluk, Bangalore Rural District, measuring 36 guntas and bounded on: **East by:** Land of Chikka Veeraiah, **West by:** Government Land, **North by:** Land of Thimmappa, **South by:** Survey No. 52, 53 & 54.
ITEM No. 22:- All that piece and parcel of the Land in Survey No. 57, New Converted Survey NO. 57/3, situated at Binnamangalal Village, Kasaba Hobli, Devanahalli Taluk, Bangalore Rural District, measuring 26 guntas and bounded on: **East by:** Land of Chikka Veeraiah, **West by:** Government Land, **North by:** Land of Thimmappa, **South by:** Survey No. 52, 53 & 54.
Item No. 23 :- Sy. No. 31 measuring to extent of 0-32 Guntas.
Item No. 24:- Sy. No. 33 measuring to extent of 0-31 Guntas.
Item No. 25:- Sy. No. 36 measuring to extent of 0-30 Guntas.
Item No. 26:- Sy. No. 38 measuring to extent of 0-29 Guntas, totally measuring 3 Acres 2 Guntas, situated at Binnamangala Village, Kasaba Hobli, Devanahalli Taluk, Bengaluru Rural, since all survey number lands are adjacent to each other and all together bounded on:
East by: Land of Muddamma, **West by:** Land of Shivanna, **North by:** Land of Sannaputappa, **South by:** Land of Lakshmidevamma.
Given under my hand & seal of the court, this 10th day of October 2023.
By Order of the Court
Sd/- Chief Ministerial Officer
Senior Civil Judge and J.M.F.C Court, Devanahalli
Advocate for Plaintiff
MANJUNATH. B R
NO. 69, OLD P.O ROAD, BYRAMANGALA, BIDADI HOBALI, RAMANAGARA-562 109.

ఏపీ మహిళా సమాఖ్య విజయవాడ నగర శాఖ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) విజయవాడ నగర శాఖ 10వ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని నూతన అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి పంచదార్ల దుర్గాంబ పేర్కొన్నారు. హనుమాన్ పేట దాసరి భవన్ వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులతో కలసి విలేకరుల సమావేశంలో భారతి, దుర్గాంబ మాట్లాడుతూ 10వ మహాసభ అమరజీవి గండు సావిత్రమ్మ ప్రాంగ ణంలో ఓర్సు భారతి, డి.సీతారావమ్మ అధ్యక్షతన జరిగిన మహాసభ జాతీయ, రాష్ట్ర నాయకుల పర్యవేక్షణలో 300 మంది ప్రతినిధులతో అత్యుత్సా హంగా జరిగిందని, నూతన నాయకత్వం 75 మంది తో కౌన్సిల్ సభ్యులు ఎంపిక చేశారని తెలిపారు.

నూతన కమిటీ

గౌరవాధ్యక్షులు కొరగంజి దుర్గాంబ, అధ్యక్షులు ఓర్సు భారతి, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గాసి రమణమ్మ ఉపాధ్యక్షులు నీలాపు భాగ్యలక్ష్మి, షేక్ నాగూర్ బి, కోటి మల్లేశ్వరి, గిరికుదిటి ప్రభ, లంకా నాగమణి, తమ్మిన దుర్గా, అండమాని నాగమణి, చింతాడ పార్వతి, నగర ప్రధాన కార్యదర్శి పంచ దార్ల దుర్గాంబ, ఆర్గనైజింగ్ కార్యదర్శి దుగ్గిరాల సీతా రావమ్మ, సహాయ కార్యదర్శిలు బంక ఝాన్సీ లక్ష్మి, నక్క రాజ్యలక్ష్మి, రెడపంగు ఉమ, మేకల పార్వతి, దర్శనం పుష్పావతి, మూలి ఇందిర, బి శాంత, కోశాధికారి బెవర ఇందిర లను 19 మంది కమిటీ సభ్యులుగా ప్రకటించారని చెప్పారు.అనంతరం గత మహాసభల నుండి నేటి వరకు జరిగిన కార్యక్రమాలపై సమీక్షించుకొని, ప్రజా ప్రయోజనాల కోసం, భవిష్యత్తు కర్తవ్యాలతో, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ, వంటగ్యాస్ సిలిండర్ రూ 500కు, పెట్రోల్ రూ 60కు, డీజిల్ రూ 50లకు ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ ఇల్లు ఇవ్వాలని, ఇల్లు ఉండి పట్టాలు లేని వారికి పట్టాలు అందజేయాలని, వృద్ధులు, వితంతువులకు, చఒంటరి మహిళలకు, ఇతరులకు ఇచ్చే పింఛన్లు రూ 2750 నుండి రూ 5వేలకు పెంచాలని, వికలాంగులకు రూ 6వేలు ఇవ్వాలని, నగరంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల అదుపులకు ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేసి వార్డు స్థాయిలో నగర స్థాయిలో ప్రతినెల సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని మహిళలు పనిచేసే ప్రతిచోట స్కూల్, కాలేజీలలో, గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, నగరంలో ప్రతి వార్డులో స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ వివిధ రకాల వృత్తి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మహిళలను కించపరిచే అశ్లీల చిత్రాల సాహిత్యం వెబ్ సైట్ లను నిషేధించాలని, మహిళల జీవితాలతో చెలగాట మాడుతున్న మద్యాన్ని నిషేధించాలని, స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని, పలు తీర్మానాలతో ప్రజలకు చేరువటానికి నూతన కమిటీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

చరిత్ర నుంచి పుట్టి కొత్త చరిత్రకు జన్మనిచ్చిన పీడీఎస్‌యూ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : చరిత్ర నుంచి పుట్టి కొత్త చరిత్రకు జన్మనిచ్చిన యాభై ఏళ్ల పీ.డీ.ఎస్.యూ అని పీ డీ.ఎస్.యూ ఉమ్మడి ఆంధ్ర మాజీ రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్ పిలుపునిచ్చారు.శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ.డీ.ఎస్.యూ) అర్ధ శతాబ్ది వార్షికోత్సవ ప్రారంభ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధ శతాబ్ది వార్షికోత్సవ ప్రారంభ సభల లోగోను మాజీ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఎ.రవిచంద్ర, పీ డీఎస్ యూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం అధ్యక్షత వహించారు. అనంతరం అమరవీరుల సంతాపం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ ప్రవేశ పెట్టారు. ముఖ్య వక్తలుగా రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ గాంధీని చంపిన మతోన్మాద శక్తులు యాభై సంవత్సరాల క్రితం జార్జిరెడ్డిని కూడా హత్య చేశారని అన్నారు.జార్జిరెడ్డి అమరత్వ స్ఫూర్తితో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ నాయకత్వంలో 1974 అక్టోబర్ 12,13 తేదీలలో మొదటి మహాసభల్లో పీ.డీ.ఎస్.యూ ఏర్పడిందని నేటికీ 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మతోన్మాద ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర మాట్లాడుతూ 50 సంవత్సరాల విద్యార్థి ఉద్యమంలో పీ.డీ.ఎస్.యూ కు ఘనమైన చరిత్ర ఉందన్నారు. విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. విద్యా వ్యవస్థను కాషాయికరణ, ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఈ విద్యా విధానాన్ని అమలు చేస్తూ మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీన ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో 4700 ప్రాథమిక పాఠశా లలను జగన్ సర్కారు మూతేసిందని దుయ్యబట్టారు. మెడికల్ విద్యను వ్యాపారం చేయడానికి జీవో నెంబర్ 108 ని జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఐ. రాజేష్,నాని రాష్ట్ర ఉపాధ్యక్షులు అది, మహర్షి, కోశాధికారి మహేంద్ర బాబు, రాష్ట్ర నాయకురాలు అభి శ్రీ, నాయకులు వీరేంద్ర, రాంబాబు, క్రాంతి, వినోద్, రమణ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సింధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంతో తిరిగి రావాలి

విశాలాంధ్ర- కంచికచర్ల: నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్య సమస్యలు విని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. తిరిగి ఆయన ఆరోగ్యం కోలుకోవాలని పూర్తి ఆయురారోగ్యాలతో ప్రజాక్షేత్రంలోకి రావాలని మనస్పూర్తిగా ప్రజలు వేచి చూస్తున్నారు. ఇందుకుగాను కంచికచర్ల శివసాయి క్షేత్రంలో శుక్రవారం నాడు మహిళ నేతలు మరియు స్థానిక తెదేపా నేతలతో కలిసి ప్రత్యేక పూజలలో పాల్గొన్న మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య గారు.

పాడి రైతుల సంక్షేమమే పాల సొసైటీ ధ్యేయం

విశాలాంధ్ర-వీరులపాడు: పాడి రైతుల సంక్షేమం మన మతం-అలుపెరగని సేవ మన అభిమతం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మైలవరం క్లస్టర్ పరిధిలో గల వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలోని విజయ డైరీ పాల సొసైటీలో కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సొసైటీ అధ్యక్షుడు, పాలకవర్గం మరియు పాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ విజయ డైరీ పాల సొసైటీ లో పాడి రైతులు సభ్యత్వం ఉండటం వలన రైతు కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టి లభిస్తుందని, రైతులు లాభాల బాటలో నడుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు మేనేజర్ యశ్వంత్ మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్

విశాలాంధ్ర - కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడి ఎంపీ యూపీ పాఠశాలలో పెదపూడి, యద్దనపూడి అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు శుక్రవారం నిర్వహించిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను ప్రాజెక్టు సిడిపిఓ పి భానుమతి పరిశీలించారు. ఈ ఎగ్జిబిషన్కు కూచిపూడి అంగన్వాడీ కార్యకర్తలు సహకరించారు. అత్యంత పోషకాహార విలువలు కలిగిన తినుబండారాలను, క్యారెట్, బీట్రూట్, రక్తం అందించే కూరలు,వివిధ రకాల ఆకుకూరలతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను పరిశీలించిన జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిరలు అభినందించారు.

గడపవద్దకే కార్పొరేట్ వైద్యం

విశాలాంధ్ర - బంటుమిల్లి : నిరుపేదల గడప వద్దకే కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని బంటుమిల్లి గ్రామ సర్పంచి స్థనం కృష్ణవేణి అన్నారు. గ్రామ పరిదిలోని ప్రభత్వ డిగ్రి కళాశాల ఆవరణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్యాధికారుల అధ్వర్యంలో నిర్వహించాతరు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా పాల్గోన్న సర్పంచి కృష్ణవేణి మాట్లడుతూ ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటి కలెక్టర్, కార్యక్రమ ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు జోగి రాజీవ్, ఎంపిపి వెలివెల చినబాబు, వైసిపి మండల కన్వీనర్ స్థనం మహేష్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, మలిశెట్టి రాజాబాబు, మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు పాలడుగుల బాబురావు ,ఎంపిటిసి కమల్ భాష, ఎంపిడిఓ జె స్వర్ణభారతి, తహశీల్దారు ఎం సత్యనారాయణ ఎంఇఓ వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శిలు దాసరి శ్రీనివాసరావు, బొల్లా వెంకన్న, ప్రత్యేక వైద్యనిపుణులు, బంటుమిల్లి, పెదతుమ్మిడి వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుండి గీతామందిరంలో శరన్నావరాత్రి మహోత్సవాలు

విశాలాంధ్ర - అవనిగడ్డ : 15 వ తేది ఆదివారం నుండి గీతామందిరంలో శరన్నావరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వై శ్రీహరి బాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ 15 ఆదివారం నుండి 23 వ తేది సోమవారం వరకు ప్రతి రోజు ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అలంకారాలు, కుంకుమ అర్చనలు నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా సరస్వతి దేవి, ధనలక్ష్మీదేవి, కనకదుర్గాదేవి, గాయత్రీదేవి అలంకారాలతో పాటు పలు రకాల అలంకారాలతో అమ్మవారు దర్శనం ఇస్తారని, ముఖ్యంగా పసుపు, కుంకుమ అలంకారం, చామంతి పూల అలంకారాలతో దర్శనం ఇస్తారని హరిబాబు చెప్పారు. అదే విధంగా ప్రతి రోజు సువర్ణ పుష్పాలతో అర్చనలతో పాటు మంత్ర పుష్పం, తీర్థప్రసాదాలు అందచేయడం జరుగుతుందన్నారు.

ఆర్థరైటిస్ పట్ల నిర్లక్ష్యం వద్దు

- చికిత్స ఆలస్యమైతే తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలు
- ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మక్కెన రవికాంత్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆర్థరైటిస్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుం దని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం వహించకుండా, సత్వర వైద్య చికిత్సలు తీసుకుంటే మెరుగైన ఫలితాలను సాధించొచ్చని మక్కెన హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మక్కెన రవికాంత్ అన్నారు. 'ఆర్థరైటిస్ అవేర్నెస్ వీక్' పురస్కరించుకుని మక్కెన హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఆర్థరైటిస్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నక్కలరోడ్డులోని మక్కెన హాస్పిటల్స్ నందు నిర్వహిం చిన ఈ సదస్సులో డాక్టర్ మక్కెన రవికాంత్ మాట్లాడుతూ, ఆర్థరైటిస్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. 40 ఏళ్ల వయసు దాటిన వారు ఆర్థరైటిస్ బారినపడే అవకాశాలున్నాయని చెప్పారు. కీళ్ల నొప్పులు, కీళ్ల వద్ద కదలికలు తగ్గడం, కీళ్లను కదిలిస్తున్నప్పుడు నొప్పి, శబ్దం రావడం, నడుస్తున్నప్పుడు, కింద కూర్చుని పైకి లేచే సమయంలో, మెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు మోకాలు, తుంటి భాగాల్లో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఆర్థరైటిస్ అవగాహన వారంలో భాగంగా ఈనెల 20వ తేదీ వరకు తమ ఆసుపత్రిలో ముందుగా రిజిస్టర్ చేయించుకున్న 200 మందికి ఉచిత కన్సల్టేషన్ అందిస్తున్నామని డాక్టర్ రవికాంత్ ప్రకటించారు. అదేవిధంగా వైద్య పరీక్షల్లో 20 శాతం, సర్జరీల్లో 10 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఆర్థరైటిస్ అవగాహన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. బిగ్ బాస్-6 కంటెస్టెంట్ షానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎం. రాధిక, జనరల్ సర్జన్ డాక్టర్ జి. ప్రదీప్ పాల్గొన్నారు.

'కూచిపూడి'కి పెరిగిన అధికారుల తాకిడి

విశాలాంధ్ర, కూచిపూడి : నాలుగవ ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం- 2023 నిర్వహించ డానికి కేవలం 24 గంటలు వ్యవధి మాత్రమే ఉండటంతో ఆ వేడుకలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించి సూచనలు ఇచ్చే అధికారుల తాకిడి పెరిగింది. దీనిలో భాగంగానే శుక్రవారం సాయంత్రం ఉయ్యూరు ఆర్డీఓ ఎన్ విజయకుమార్ సభా వేదికను, ప్రాంగణాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ పర్యవేక్షణలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జయహో భారతీయం, కూచిపూడి ఆర్ట్.అకాడమీ, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సంయుక్త నిర్వహణలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం భారీ స్థాయిలో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ మంత్రి రోజా, గృహ నిర్మాణ శాఖ మంత్రి రమేష్ లు జిల్లా స్థాయి అధికారులతో పాటు హాజరవుతారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా, మండల స్థాయి అధికారుల ఆదేశాలతో కూచిపూడి గ్రామ సర్పంచ్. కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి భర్త అమరబాలేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ భవాని, పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది కళాపీఠం ప్రాంగణం, వెంపటి చినసత్యం ప్రాంగణాన్ని శుభ్రంగా తీర్చి దిద్దటంలో నిమగ్నమైనారు. ఈనేపధ్యంలో ఉయ్యూరు ఆర్డీఓ ఎన్ విజయ్ కుమార్, డి ఎల్ డి ఓ. నాంచారయ్య కూచిపూడి కార్యక్రమాలు నిర్వహించే రెండు ప్రాంగణాలను పరిశీలించారు. దీనిపై వారందరికీ పలు సూచనలు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ జి రామ లక్ష్మణ్, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎండిఓ జి సుధాప్రవీణ్, మండల ప్రత్యేక అధికారి డి. విజయవర్ధనరావు, కళా పీఠం పర్యవేక్షకులుపి. పార్థసారథి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో కే లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో సామూహిక ఎలుకల నివారణపై అవగాహన

విశాలాంధ్ర, కూచిపూడి : ఖరీఫ్ సీజన్లో వరిపైరుపై దాడి చేస్తున్న ఎలుకలను సామూహికంగా నిర్మూలించే విధానంపై శుక్రవారం మొవ్వ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. వరి పొట్ట దశలో ఉందని ఈ దశలో ఎలుకలు పెరిగి వారిపై రెండు నాశనం చేసే అవకాశం ఉందని శ్యామల హెచ్చరించారు. ఈ సమయంలో రైతులు అశ్రద్ధ చేయక సామూహికంగా నిర్మూలించు కోవాలని సూచించారు. వాటిని నివారించేందుకు వినియోగించే రసాయనాలతో కూడిన బ్రోమోడి యోలోన్ తయారు చేసే విధానాన్ని చూపించటం తోపాటు రైతులకు నూరు శాతం సబ్సిడీ పైమందును పంపిణీ చేశారు. 100 గ్రాముల గ్రాముల విషపు ఎర తయారీకి 96 గ్రాములు నూకలు, రెండు గ్రాముల బ్రోమోడియోలోన్, రెండు గ్రాముల వేరుశనగ నూనెలను బాగా కలిపి , తయారైన ఎరను చిన్న చిన్న పొట్లాలుగా కట్టాలని వివరించారు. ఆ విషపు ఎర పొట్లాలను సాయంత్రం వేళలో ఎలుకల బొరియల వద్ద పెట్టాలని సూచించారు. ఈ విధంగా దశలవారీగా ఈ ప్రక్రియ నిర్వహించి ఎలుకలను నివారించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ ఏ.డి.ఏ. ఎస్. శ్యామల, ఏ.ఓ. కే. శివప్రసాద్, గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, వ్యవసాయ సలహా మండలిమొవ్వ అధ్యక్షులు మండవ రత్నగిరి రావు, వి. ఏ. ఏ.లు పి నాగరాజు, ఎస్, కవిత వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసులను వెంటనే ఎత్తివేయాలి

విశాలాంధ్ర - అవనిగడ్డ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులను నిరసిస్తూ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ సెంటర్లో ప్లేకార్డులతో నిరసన తెలియచేసి మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి విడుదల చేయాలని ఆయన ఆరోగ్య పరిస్థితులు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఆరోగ్యంకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సైకో ముఖ్యమంత్రి, ప్రభుత్వం భాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్.సి నాయకులు ఎం. మాచవరపు ఆదినారాయణ, నాగాయలంక, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, బండె శ్రీనివాసరావు, మహిళా నేతలు, తలశిల స్వర్ణలత, బండె కనక దుర్గ, పైడిపాముల కృష్ణకుమారి, దివి యుంగధరి, యాసం లంకమ్మ, మండలి రాంమోహన్‌రావు, బచ్చు రఘునాథ్, ఉప్పాల ప్రసాద్, తోట రాంబాబు, పులిగడ్డ నాంచారయ్య లతో పాటు పలువురు పాల్గోన్నారు.

ఐడీబీఐ బ్యాంక్ శాఖల్లో రిటైల్ లోన్ ఫెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పండుగ సీజన్‌ను మరింత వేడుకగా ఆచరించుకునేందుకు, ఐడిబిఐ బ్యాంక్ ఈనెల 16, 17 తేదీల్లో 'రిటైల్ లోన్ ఫెస్ట్'ని నిర్వహించనుంది. 'బ్యాంక్ అంటే స్నేహితుడి లాగా' అనే బ్యాంక్ బ్రాండ్ సిద్ధాంతాన్ని మరింత విస్తరింపజేస్తూ, లోన్ ఫెస్ట్ బ్యాంక్ కస్టమర్ సెంట్రిక్ విధానం, హౌసింగ్ లోన్, ఆటో లోన్, ఎడ్యుకేషన్ లోన్, ప్రాపర్టీపై లోన్, పర్సనల్ లోన్, సెక్యూరిటీలపై లోన్ వంటి అనేక రకాల రిటైల్ లోన్‌లలో ప్రత్యేక ఆఫర్‌లను అందించనుంది. ఈ పండుగ వేడుకల సమయంలో జీవనశైలి నిర్ణయాలకు అనుకూలమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్నందున, 'రిటైల్ లోన్ ఫెస్ట్' ప్రతి భారతీయ కుటుంబానికి పునరుద్ధరించబడిన ఆకాంక్షలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉంది. దేశ వ్యాప్తంగా 81 జిల్లాలు, 88 కేంద్రాలు, 22 రాష్ట్రాల పరిధిలో 'రిటైల్ లోన్ ఫెస్ట్'ను నిర్వహించేందుకు బ్యాంక్ 125కు పైగా శాఖలను ఎంపిక చేసిందని ఐడిబిఐ బ్యాంక్ డీఎండీ సురేష్ ఖతన్‌హర్ తెలిపారు.

మన కోసం మనం ట్రస్టుకు డాక్టర్ వరుణ్ రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనలో భాగంగా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్టుకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ దాసరి వరుణ్ లక్ష రూపాయలు విరాళంగా అందచేశారు. శుక్రవారం 2909వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొని స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ సేవలందించారు. ట్రస్ట్ సభ్యులు నల్లూరి రామారావుకు రూ.లక్ష చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతిలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం ప్రభుత్వం ఆశయం

విశాలాంధ్ర - ఉంగుటూరు : ప్రతి ఒక్కరికి నాణ్యంమై న వైద్యం అందాలన్నదే సియం జగన్మోహనే రెడ్డి ఆశయం అని యండి ఓ శేషగిరిరావు అన్నారు. మండలం లో మానికొండ సచివాలయం,2 లో జగన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రమిశెట్టి అంజన కుమారి, రమిశెట్టి వెంకటేస్వశరవు,యంపీపీ సరోజిని. యంపిడి ఓ శేషగిరిరావు, ఈ ఓ ఆర్డిఓ భాషా ఈ ఓ రత్న కిషోర్,,గ్రామపార్టీ కన్వీనర్ గోగినేనివెంకటేశ్వరవు,కో అప్ రేటివ్ బ్యాంక్ అధ్యక్షులు గోగినేని వెంకటేశ్వరవు. బాబు. సర్పంచి నిమ్మకూరి స్వర్ణ లత,యంపిటిసి కుసుమ మహిళనాయకులు సూరెడ్డి, పండమ్మ,సూరెడ్డి రమేష్, మాజీ సర్పంచి నేర్సు చింతయ్య, నాయకులు కోట శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ నిరాహార దీక్ష

విశాలాంధ్ర - రెడ్డిగూడెం : ఆంధ్రప్రజల అభివృద్ధి సాధకుడు ప్రజల మనిషి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు చేయడంతో కూనపరాజుపర్వ గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో నాగేశ్వరరెడ్డి దీక్షను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీవీ సత్యనారాయణ(విజయబాబు) మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు ప్రతిపక్ష నాయకునిగా అంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు ఉన్నారని, 45 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంలో అవినీతి లేని రాజకీయ నేత మహానాయకుడు చంద్రబాబు అని రాజకీయ కుట్రతోనే జగన్ ప్రభుత్వం అరెస్టు చేయిం చిందన్నారు. ఈ దీక్షలో వేణుగోపాలరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులురాయుడు వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ పెద్దలు, జనసేన నాయకులు, టీడీపీ కుటుంబ సభ్యులు, జనసేన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

త్రయోదశి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర అవనిగడ్డ : రాజరాజేశ్వరి సమేత రాజశేఖర స్వామి దేవస్థానంలో నందీశ్వరునికి విశేష అభిషేకాలు నిర్వహిం చారు. త్రయోదశి పర్వదినాన్ని పురస్క రించుకుని శుక్రవారం ఆలయ అర్చ కులు ఘంటశాల సంతోష్ పవన్ కుమార్ శర్మ నందీశ్వరునికి విశేష అభిషేకాలను వేద మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభిషేకాలను తిలకించి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బాలల రక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ : బాలలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నవజీవన్ బాలభవన్ బోస్కోడి అడిక్షన్ సెంటర్ ఇన్‌చార్జ్ జే.ఆంజనేయులు అన్నారు.నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నున్న పంచాయితీ ఆఫీసులో పారిశుధ్య కార్మికులకు "బాలల పరిరక్షణ" పై అవగాహనా కార్యక్రమాన్ని శు క్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంత్సరాల లోపు వయస్సు కలిగినవారు అందరూ బాలలే అన్నారు. పిల్లల అభిప్రాయాలను గౌరవించాలని, వారి మాటలకు విలువని ఇవ్వాలి అని, బాలలను కొట్టడం, తిట్టడం మానసికంగా వేధించటం వలన వారు మానసికంగా కుంగుబాటుకు గురిఅవుతారని చెప్పారు. ఈ కార్యక్రమములో నున్న పంచాయితీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి సురేష్, పారిశు ధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్వామి వారికి మాసశివరాత్రి పూజలు

విశాలాంధ్ర - అవనిగడ్డ : రాజరాజేశ్వరి సమేత రాజశేఖరస్వామి వారి దేవస్థానంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు, విశేష అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరిం చుకుని ఆలయ అర్చకులు ఘంటశాల సంతోష్ పవన్ కుమార్ శర్మ ఆద్వర్యంలో స్వామి వారికి వేకువజామునే ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు.

రాజధానిని తరలించే దమ్ము ఎవరికి లేదు

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, ప్రభుత్వ కార్యాయాలు వేటిని తరలించవద్దని హైకోర్టు విస్పష్టంగా చెప్పింది, దానిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు సైతం నిరాకరించినా దొడ్డిదారిన చీకటి జీవో తో ముఖ్యమంత్రి ఋషి కొండకు వెళ్ళ టానికి ప్రయత్నం చేయటాన్ని ఆంధ్రప్రదేశ్ బహుజన అత్మగౌరవ సమితి రాష్ట్ర అధ్యక్షులు పోతుల బాలకోటయ్య తీవ్రంగా ఖండించారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటిదాకా ఆంధ్రప్రదేశ్‌ను ఏలిన ముఖ్యమంత్రులది ఒక దారైతే జగన్ రెడ్డిది మరో దారి రాజధానిని మార్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని హై కోర్ట్ స్పష్టంగా చెప్పిందని,5 సార్లు స్టే ఇవ్వమని సుప్రీం కోర్టుకు వెళ్లిన కుదరదని చెప్పినా ఉత్తరాంధ్ర అభివృద్ధి అనే ముసుగేసి కోర్టులను కుడా మభ్యపెట్టేందుకు తెగబడ్డారన్నారు. అమరావతి రాజధాని నేను ఇల్లు కట్టుకున్న అని చెప్పి అధికారంలోకి వచ్చారు ఇక్కడని అయిపోవటంతో సర్దుకుని ఋషికొండకు బయలుదేరుతున్నారు. అక్కడ ప్యాలస్‌లో బాత్రూం కమోడ్ ఖరీదు 25 లక్షలు,270 కోట్లతో విలాసవంతమైన భవనం కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నవ క్రాంతి పార్టీ అధ్యక్షులు కనకం శ్రీనివాసరావు,మామిడి సత్యం,సిరం శెట్టి నాగేంద్రరావు,పాల్గొన్నారు.

జగన్ మోహన్ రెడ్డి మాట్లాడే విధానం మార్చుకోవాలి

విశాలాంధ్ర -మైలవరం: పవన్ కళ్యాణ్ పై బురదచల్లటమే లక్ష్యంగా జగన్ మోహన్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని, ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి ఉండి ఈ విధంగా మాట్లాడం సరికాదని జనసేన మైలవరం నియోజకవర్గ ఇంచార్జి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ). అన్నారు. మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌తో పాటు ఆయన పాలనలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతలపై అసభ్యకర పదజాలంతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని నడిపించే నాయకుడే సరైన మార్గంలో నడవపోతే తనతో పాటు కలసి నడిచే వారు ఏ విధంగా సక్రమమైన మార్గంలో నడుస్తారాని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను పటిష్ట పరిచి,వారికి ప్రభుత్వ గుర్తింపును కలిగిస్తూ,వారికి రాజ్యాంగం ప్రకారం అన్ని వసతులు అనగా 15వేల రూపాయల వేతనంతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ మైలవరం మండల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, రెడ్డిగూడెం మండల అధ్యక్షులు చాపలమడుగు కాంతారావు,ఉపాధ్యక్షులు పాములపాటి సుందర్ రామిరెడ్డి, నాయకులు చంద్రాల మురళీకృష్ణ,కటకం ధర్మారావు, ఎర్రంశెట్టి నాని,మర్రి కొండలరావు,శీలం కృష్ణమూర్తి, దాసరి వెంకట శశికుమార్,శీలం చందు తదితరులు పాల్గొన్నారు.

నున్న జడ్పీ హైస్కూల్‌లో హ్యాండ్‌బాల్ కోర్టు అభివృద్ధి

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులను మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆదర్శ రైతు గుంటక సుబ్బారెడ్డి ముందుకు వచ్చారు. కొంతకాలంగా విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందికరంగా ఉన్న హ్యాండ్‌బాల్ కోర్టును అభివృద్ధి చేసి ఆటకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఇటీవల కురిసిన వర్షానికి హ్యాండ్‌బాల్ కోర్టులో గడ్డితోపాటు పిచ్చి మొక్కలు మొలిచాయి. దీంతో విద్యార్థులు ఆడుకునే సమయంలో మొక్కల మోళ్లు కాళ్లకు గుచ్చుకుంటున్నాయి. దీనికితోడు పాఠశాలలో సుమారు 720 మంది విద్యార్థులుండగా, సుమారు 200 మంది విద్యార్థులు పలు రకాల ఆటల పోటీలలో చురుకుగా పాల్గొంటున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఇప్పటికే సుమారు 60 మంది అర్హత సాధించారు. పాఠశాల ఆవరణలోని హ్యాండ్‌బాల్ కోర్టులో హ్యాండ్‌బాల్‌తో పాటు బాల్ బ్యాడ్మింటన్, ఖో - ఖో, రగ్బీ తదితర ఆటలను విద్యార్థులు ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే, ఆటలకు అనుకూలంగా ఉన్న హ్యాండ్‌బాల్ కోర్టును స్వయంగా పరిశీలించిన ఆదర్శ రైతు సుబ్బారెడ్డి తన డబ్బులు వెచ్చించి బాగు చేయించారు. రెండుసార్లు డోజర్‌తో చదును చేయించడంతోపాటు విద్యార్థులు తిరిగి ఆడుకునేందుకు అనుకూలంగా మార్చారు. ఇటీవల నున్న హైస్కూల్‌లో చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో, విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసమే హ్యాండ్‌బాల్ కోర్టును అభివృద్ధి చేసినట్లు రైతు సుబ్బారెడ్డి తెలిపారు. తాను చదువుకున్న పాఠశాల క్రీడాభివృద్ధితో తానూ భాగస్వామ్యంకావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. సుబ్బారెడ్డి దాతృత్వానికి పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు టీ విజయ వర్మ, టీ శ్రీలత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న స్కూలు యాజమాన్యం

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : తమ స్కూలులో చదువుతున్న జీవన జ్యోత్స్న అనే విద్యార్థిని గత కొన్ని సంవత్సరాలుగా చేతికి అరుదైన వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకోవడానికి ఆర్థికంగా స్తోమతలేని ఆ పాప తల్లి పడుతున్న ఆవేదనను అర్థంచేసుకున్న సింగ్ నగర్ లోని అక్షర నందన స్కూలు యాజమాన్యం స్పందించి తమ స్కూలులోని ఉపాధ్యాయులు, సిబ్బంది-విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లితండ్రుల నుంచి విరాళాలు సేకరించి ఆ పాప చేతి శస్త్రచికిత్సకు అవసరమయ్యే ఐదు లక్షల రూపాయలను శుక్రవారం నున్న పోలీస్ స్టేషన్ ఎస్ఐ గోవింద్ చేతుల మీదుగా ఆ పాప తల్లికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్కూలులో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల చదువు, క్రమశిక్షణ వంటి అంశాలలో శ్రద్ధ చూపడం కష్టంగా ఉన్న ఈ రోజుల్లో మానవతాదృక్పదంతో తమ స్కూలులో చదువుతున్న ఒక విద్యార్థిని ఆరోగ్యం పై, వాళ్ళ కుటుంబ ఆర్థిక స్థితిని తెలుసుకుని తమ స్కూలు అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు సహకారంతో ఇంత పెద్ద మొత్తంగా విరాళాలు సేకరించి ఆ పాప శస్త్రచికిత్సకయ్యే ఖర్చును అందజేసిన అక్షరనందన హైస్కూలు యాజమాన్య సేవానిరతిని అభినందించారు.స్కూలు కరస్పాండెంట్ హర్ష మాట్లాడుతూ తమ స్కూలులో చదువుతున్న పాపకు ఉన్న ఇటువంటి అరుదైన వ్యాధిని, వాళ్ళ కుటుంబ ఆర్థికస్థితిని తెలుసుకుని చలించి తమ స్కూలులోని ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యారినీ విద్యార్థులు మరియు వారి తల్లితండ్రుల సహకారంతో ఇటువంటి సేవాకార్యక్రమం చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని, ఇటువంటి మహత్కార్యానికి సహకరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నరేష్,ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి ,ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.